# ఆలోచనము

కోర్టు బార్ ... కోలాహలంగా ఉంది. తొలకరి చినుకు పడగానే కృషీవలుని మానసిక స్థితిలా సందడిగా ఉంది. పట్టణంలో వివిధ కోర్టుల్లో పనిజేస్తున్న జూనియర్ లాయర్లంతా అదే కోర్టులో హాజరయారు. అసాధారణ వాదనాపటిమతో కోతిని కొండ ముచ్చులా, నల్లిపిల్లను పులిలా నిలబెట్టగల లాయర్ ఆత్మానందం ఓ ముఖ్యమైన కేసులో, అదే కోర్టులో వాదించబోతున్నాడు. అతని క్రాస్ ఎగ్జామినేషన్‌లోని మెలికల్ని, ఆర్గ్యుమెంటు మెరుపుల్ని ప్రత్యక్షంగా వీక్షించి, ఆకళింపు చేసుకుని తమ వృత్తి విద్యకు పదును పెట్టుకోవాలని ఆసక్తిగా ఎదిరిచూస్తున్న నల్లకోట్ల వేడి ఆశల మీద మంచినీళ్ళు చల్లే వార్త గుప్పుమంది.

"అడ్వకేటు ఆత్మానందంకు ఆక్సిడెంటయింది. ఆసుపత్రిలో ఆపరేషనైందటా" అభిజ్ఞవర్గాల ద్వారా తెలిసిన విషయం పరేషాన్‌లో పడేసింది. గుట్టు చప్పుడు కాకుండా ఆత్మానందం బాపతు కేసులు కుప్పిగంతువేసి మరో రోజుకు వాయిదా పడ్డాయి.

"అంత ముందుచూపున్న ఆత్మానందంకు ఆక్సిడెంటా !?" బార్ మెంబర్సూ, క్లైంట్సూ ముందు ముక్కుమీద వేలేసుకొని ఆ తర్వాత ఆదరాబాదరాగా ఆస్పత్రికి పరుగెత్తారు.

కార్పొరేట్ హాస్పిటల్ క్రమబద్ధంగా ఉంది. ఆత్మానందంను ఆపరేషన్ థియేటర్నుంచి తీసుకొచ్చి చాలా సేపైంది. అంతమంది అడ్వకేట్సు ఆస్పత్రిలో కనబడే సరికి డాక్టర్ల నరాల్లో కొత్తరాగాలు ఉరుకులాడినై, గుండెలు గుబగుబలాడినై, ఆస్పత్రి సూపర్నెంటు అందరికీ స్వాగతం పలికి ఆత్మానందం మంచం వద్దకు తీసుకెల్తున్నాడు. అది చూసి ఆత్మానందం కుటుంబ సభ్యులు పక్కకు సర్దుకున్నారు.

"ఆత్మానందం గారికి స్పృహ వచ్చింది సార్ !" పొద్దున్నే ఆపరేషన్ నిర్వహించిన ఆర్థోపెడిక్ డాక్టర్ చిరునవ్వుతో ఎదురొచ్చి సూపర్నెంటుకు చెప్పేశాడు. మందుల వాసన, రోగులు మూల్గుల మధ్య "వెరీగుడ్ !" సూపర్నెంటు కనుబొమలెగిరి పడినై. స్టెతస్కోపును మడిచి తెల్లగౌను జేబులో ఉంచి లాయర్ల ముందు, ప్రజల ముందు ప్రజానాయకుడిలా నడుస్తూ "రండి సార్ రండి కానీ... ప్లీజ్... పేషంటును విసిగించొద్దు సార్ !" సవినయంగా మనవి చేశాడు.

బెల్లం చుట్టూ చీమల్లా మంచం చుట్టూ మూగారంతా. అంతటి ఆత్మానందం కుడికాలు నిండా పట్టీతో చక్రాల ఆధారంగా గాల్లో వేళ్లాడుతోంది. పొడిపొడి మాటలతో, కంటి సైగలతో పరామర్శల పర్వం ముగిసింది. ఎర్రని పుట్టమీద నల్లనాగులా - కాస్సేపు సూపర్నెంటు స్టెతస్కోపు ఆత్మానందం గుండెల మీద తచ్చాడింది. అందర్నోసారి కలియజూస్తూ, తృప్తిగా నిట్టూర్చి "అసలు... మీకీ ప్రమాదమెలా జరిగిందో మూడు ముక్కల్లో చెప్పండి సార్ !" ఆత్మానందాన్నడిగాడు. ఎందుకైనా మంచిదని తానే స్పందించాడు. పూర్తయిన గ్లూకోజు బాటిల్‌ను మార్చేస్తూ "ఫరవాలేదు, చెప్పండి సార్!" డ్యూటీ డాక్టర్ బలపరిచాడు.

న్యాయస్థానంలో నాణ్యమైన చిరుతపులిలా కన్పించిన ఆత్మానందం పిల్లిపిల్లలా వెల్లకిలా పడుకున్నాడు. అందర్నోసారి చూపులతో తడిమి ఊపిరి పీల్చుకున్నాడు. "మీరంతా కూచుంటే..."

"అయ్యబాబోయ్" సూపర్నెంటు గుండెమీద చెయ్యేసుకున్నాడు. "సారీ సర్ ! ఇన్ని కుర్చీలు అరేంజ్ చెయ్యాలంటే ..."

"ఫరవాలేదు. ఇట్లానే నిల్చుంటాం చెప్పండి." బార్ అధ్యక్షుడు భరోసా ఇచ్చాడు.

కళాత్మకమైన సినిమాలు తీసి కలెక్షన్లు రాక దివాలా ఎత్తిన నిర్మాతలాగుంది ఆత్మానందం వాలకం. గొంతు సర్దుకున్నాడు.

"రోజట్లాగే ఈ రోజు తెల్లవారకముందే మార్నింగ్ వాక్‌కు బయలుదేరాను. హైవే మీద హాయిగా నడుస్తున్నాను. అప్పుడే తూరుపు ఆకాశం ఎర్రబారింది. ఆ టైంలో రోడ్ మీద ట్రాఫిక్ తక్కువుంటుంది గదా ? ధీమాగా - ఈ రోజు వాదించబోయే కేసుల గురించి నెమరేసుకుంటున్నాను. అందులో ముఖ్యమైనది కళాధర్ కేసు. కాలేజి కాంపస్‌లో క్లాసుమేటు కమలను ముద్దుబెట్టుకుని క్రిమినల్ కేసులో ఇరుక్కున్నాడతను. ఆ కేసు గురించి మెదడు పొరల్లో వాదప్రతివాదనలు జరుగుతున్నాయి. ముందట్నుంచి ఏదో వెహికల్ నా ఆలోచనలకంటే వేగంగా పరుగెత్తుకు రావడం గుర్తుంది. అంతే... ఆ తర్వాత ఏం జరిగిందో గుర్తులేదు" పెదాలు చప్పరించాడు.

"ఆత్మానందం గారు గుద్దుకుంది నా కారునే సార్ !" పక్కన నుంచున్న టిప్‌టాప్ జంటిల్‌మెన్ ముందుకొచ్చాడు. "నా పేరు బాలేశం" టై సర్దుకుంటూ ప్రారంభించాడు.

"తెల్లవారక ముందు మనుషుల ట్రాఫిక్ తక్కువుంటుంది గదాని సొంతకారులో, సొంత డ్రైవింగ్‌తో హైద్రాబాదుకు బయలుదేరి హైవే మీద వస్తున్నాను. అనుకోకుండా నా కారు కెదురొస్తున్నారీయన గారు. హారన్ గట్టిగా కొట్టాను. వీరేమి ఆలోచిస్తున్నారో గాని కన్నుమూసి తెరచేలోగా కారుకు దగ్గరయ్యారు. కంగారుగా స్టీరింగ్ తిప్పినా లాభం లేదు. వీరి కాలు నా కారు వెనుక చక్రం కింది కొచ్చేసింది. వెంటనే స్పృహ తప్పారు. నేనే హాస్పిటల్‌కు తీసుకొచ్చి చేర్పించాను. వీరికి తెలిసినాయనెవరో వీరింటికి ఫోన్ చేశారు...."

అంతా విని అందరూ ఆశ్చర్య సముద్రకెరటాలైనారు. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

"మార్నింగ్ వాక్ ఆరోగ్యానికి మంచిదే కాని... మనిషితో పాటు మనసు గూడా ఆధీనంలో ఉండి తీరాలి." సూపర్నెంటు ముక్తాయింపు అందరి ఆలోచనాలోచనాలను కదిలించింది.

*(ప్రసారిక - సెప్టెంబర్, 2005)*